క్లుప్తంగా

గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్


తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి : గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని బాల్నేపల్లి గ్రామంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడి పంటలతో బాగుండాలని గిరిజన దేవతను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ : భారత రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దేరకొండ సీనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. శనివారం దేవరకొండ మున్సిఫ్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లీగల్ సెల్ సభ్యులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉమామహేష్ యాదవ్, గాజుల ఆంజనేయులు, మాడెం రాములు, ముస్తాక్ అహ్మద్, వనం జగదీశ్వర్, ఈడెం రవి, సాయి పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేణు పటేల్

మిర్యాలగూడ టౌన్ : మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పందిరి వేణు పటేల్ నియమితులయ్యారు. శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు పటేల్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. తన నియమకానికి సహకరించిన సంఘం జిల్లా, రాష్ట్ర నేతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో ఆగస్టు 13న నిర్వహించనున్న వికలాంగుల మహాగర్జనను విజయంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుద్దేటి సైదులు, రాష్ట్ర సీనియర్ నాయకుడు శ్రీరామదాసు వెంకటాచారిలు కోరారు. శనివారం దేవరకొండలో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో అంజయ్య, దీప్లానాయక్, పచ్చిపాల కృష్ణయ్య, కిషన్‌లాల్, నేతాల అంజయ్య, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని వినతి


విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నాయకునితండా సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడెం డివిజన్ విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు మేరావత్ మునినాయక్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ మంజూరు అయ్యి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. సబ్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు విద్యుత్ కష్టాలు తీర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరావత్ నాగేందర్, బిచ్యాలు, రవీందర్, శౌరీ, బాలు, బిక్కు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి

కొండమల్లేపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌పై అసత్య ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సామగ్రి, ఫర్నీచర్, ఏసీలు, కుర్చీలు, సోఫా సెట్లను తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు.

ఆన్‌లైన్ అవ్వక.. పథకాలు అందక

- పలు గ్రామాల్లో ఆన్‌లైన్ కాని ప్రజా పాలన దరఖాస్తులు
- దీంతో అర్హులకు సంక్షేమ పథకాలు దూరం
- ఆన్‌లైన్‌కు అవకాశం కల్పించాలని కోరుతున్న పేదలు


ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

త్రిపురారం : గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో త్రిపురారం మండలంలోని పలు గ్రామాల్లో కొంతమందికి అర్హత ఉన్న సంక్షేమ పథకాలు అందడం లేదు. కొంతమంది ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో అర్హులు పథకాలకు దూరమయ్యారు. లబ్ధిదారులు మండల అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామల్లో గ్రామ సభలను నిర్వహించిన ప్రజా పాలన దరఖాస్తులను నేరుగా స్వీకరించి రశీదులు కూడా అందజేశారు. అనంతరం ఆ దరఖాస్తులను ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. ఈ ప్రక్రియను మొత్తం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. అయితే మండలంలోని 32 గ్రామ పంచాయతీల ఉండగా పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వ్యవహరించి పలు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పేద ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలు అందడం లేదు. దీంతో ఆ లబ్ధిదారులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం లోని ప్రజా పాలన హెల్ప్‌డెస్క్‌లను ఆశ్రయించిన ఫలితం లేకుండా పోయింది. ఆ కుటుంబాల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో ఏమి చేయాలేమని పేర్కొంటున్నారు.దీంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉండాల్సి ఉంది. జిల్లా అధికారులు స్పందించి ప్రజా పాలన పెండింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవడానికి మరో అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్ ఉన్న గ్రామాలు

మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో త్రిపురారం-450, నీలాయిగూడెం-210, అంజనపల్లి -90, మాటూర్-250, డొంకతండా-280, పెద్ద దేవుల పల్లి-250, దుగ్గెపల్లి-180, పలుగుతండా -120, లచ్యాతండా-80, కాపువారి గూడెం-180, చెన్నాయిపాలెం-130, బొర్రాయిపాలెం-120 దరఖాస్తులతో పటు పలు గ్రామాల్లో ఆన్‌లైన్ కాని దరఖాస్తులు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఆన్‌లైన్ అయి ఉన్నవాటిలో సైతం ఉచిత కరెంట్ టిక్ చేయకుండా ఆన్‌లైన్ చేయడంతో కొందరి లబ్ధిదారులకు ఉచిత కరెంట్ అందడం లేదు. జిల్లా అధికారుల పరిధిలో ఉన్నందున్న ఆన్‌లైన్‌కు అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ అవకాశం కల్పిస్తామన్నారు



అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. పెద్దదేవులపల్లిలో సుమారు 250 మంది కుటుంబాల ప్రజా పాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయలేదు. వారు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఆన్‌లైన్‌కు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఇది పెద్ద తప్పిదమని ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే అవకాశాన్ని పరిశీలించి అవకాశం కల్పించి కల్పిస్తామని హమీ ఇచ్చారు.

– అంబటి సోమయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

ఆన్‌లైన్ కాలేదు అంటున్నారు



మా అమ్మ ధనావత్ కమల, మాటూర్ గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తు చేసుకుంది. రశీదు కూడా ఇచ్చారు. కాని ఇంటికి ఉచిత విద్యుత్ పథకం వర్తించడంలేదు. కరెంటు వాళ్లని అడిగితే ఎంపీడీఓ ఆఫీస్‌లో అడగమన్నారు. ప్రజా పాలన హెల్ప్ డెస్క్‌లో కలిస్తే దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదు అన్నారు. ఇప్పుడు ఏమి చేయలేము అని చెబుతున్నారు. చాల రోజుల నుంచి తిరిగాను. మాకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడంలేదు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి ప్రభుత్వ పథకాలు అందేవిదంగా చర్యలు తీసుకోవాలి.

– ధనావత్ రమేష్, మాటూర్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ఏరియా ఆస్పత్రిలో అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు నిత్యం అల్పాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగుల సహాయకులకు అందించే అల్పాహార కార్యక్రమాన్ని సందర్శించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎం .నాయుడు, కూటాల రాంబాబు, కోశాధికారి నారాయణ రావు, కర్నాటి రమేష్, మట్టి మనిషి వెనేపల్లి పాండురాంగారావు, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, జాడి. రాజు, కోల సైదులు, ఏచూరి నాగలక్ష్మి, మురహరి, అనంతరెడ్డి, శంకర్‌రెడ్డి, రామారావు, మధు, మంగతాయి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మిర్యాలగూడ : కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దుబ్బతండాలోని కేజీబీవీని ఆయన సందర్శించి వంట గదిని, పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను ఆయన అభినందించారు. హాస్టల్‌లో నీటి సదుపాయం సరిగా లేదని తెలపడంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కాల్వల పనులు త్వరగా పూర్తిచేయాలి


కాలువ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

పెద్దవూర : కుంకుడుచెట్టుతండా ఎత్తిపోతల పథకం ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వపై ఏర్పాటు చేసిన డీ 8,9 కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పూల్యాతండా సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వరద కాలువలో అంతర్భాగమైన డీ-8,9 కాలువ పనులను ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నెల్లికల్లు లిఫ్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం 24500 ఎకరాలకు సాగునీరు అందేలా డిజైన్ చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 5100 ఎకరాలకు ప్రాజెక్టును పరిమితం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేసీఆర్ చిత్తశుద్ధితో తలాపున కృష్ణమ్మ ఉన్నా సాగు, తాగునీటికి నోచుకోక పడుతున్న ఇబ్బందులను చూసి నెల్లికల్లు లిఫ్టును మంజూరు చేశారని తెలిపారు. వరద కాలువలో అంతర్భాగమైన కుంకుడుచెట్టుతండా లిఫ్టు పనులు పూర్తయితే పెద్దవూర, తిరుమలగిరిసాగర్ మండలాలలోని 14గ్రామాలకు 7163 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మరమ్మతులకు గురైతే పట్టించుకోని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. డీ-8,9 కాలువలను, నెల్లికల్లు లిఫ్టును ఏదైతే 24500 ఎకరాలకు డిజైన్ చేశారో సంపూర్ణంగా పూర్తి చేయాలని లేనిపక్షంలో ఈ ప్రాంత రైతులతో వచ్చే నెలలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, నాయకులు సుందర్ రెడ్డి, రవినాయక్, శ్రీనివాస్, శ్రీకర్, సత్యం, రాజేష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, దస్రు, ముత్యాలు, గోపి, శ్రీదేవి, పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయించొద్దు

- మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


మాడుగులపల్లి : ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

వేములపల్లి : యూరియాను దుకాణాదారులు ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను, గోదామ్‌ను పరిశీలించి మాట్లాడారు. సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పత్యానాయక్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, సహకార అసిస్టెంట్ రిజిస్టర్ కృష్ణ, మార్కెట్ జిల్లా మేనేజర్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్, ఏఓ కిశోర్‌నాయక్, మార్కెటింగ్ ఇన్‌చార్జి స్వామి, ఏఈఓ నితిన్, సీఈఓ రవీందర్‌రావు, రాజు, యువాన్, గిరి, యాదగిరి ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

మాడుగులపల్లి : ఎరువుల దుకాణాల వ్యాపారుల ప్రభుత్వ నియమ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగార్జున డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీని ఆయన ఆకస్మికంగా సందర్శించి గోదాంలోని ఎరువుల స్టాక్‌ను, బిల్లులను, స్టాక్ రిజిస్టర్‌ను, రికార్డులను, ఈ పాస్ మిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఈ పాస్ యంత్రం ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, యూరియాను అవసరాలకు మాత్రమే వినియోగించాలన్నారు. వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే దుకాణదారులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, మార్కెట్ ఫెడ్ డీఎం జ్యోతి, డీసీవో పత్యానాయక్, ఏవో శివరాంకుమార్, డీలర్లు యాదగిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కర్లపాటి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

నేడు చందంపేటకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాక

చందంపేట : నేరెడుగొమ్ము, చందంపేట మండలాల్లో లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి ఆదివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రానున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమల వెంకటయ్య గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, కలెక్టర్ ఈ పంపిణీ కార్యక్రమంలో పాలొంటారని తెలిపారు.

టీబీ పేషెంట్లు పోషకాహారం తీసుకోవాలి

త్రిపురారం : టీబీ వ్యాధిగ్రస్తులు సకాలంలో పోషకాహారం తీసుకోవాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ సంజయ్ సూచించారు. శనివారం మండల కేంద్రగదంలోని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లోని టీబీ పేషెంట్లకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడారు. టీబీ మందులతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల టీబీ సకాలంలో నయమవుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కమలమ్మ, టీబీ నోడల్ అధికారి పుట్ట గోపాల్ రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ నళిని కాంత్, వైద్య సిబ్బంది భవాని, శాంతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటర్లకు మరమ్మతులు చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

డిండి: డిండి ప్రాజెక్టు ఎడమ కెనాల్‌కు సంబంధించిన పలు డిస్ట్రిబ్యూటర్లకు మరమ్మత్తులు చేపట్టాని సిబ్బందికి సూచించినట్లు ఇరిగేషన్ ఈఈ ఎలమందయ్య తెలిపారు. వానాకాలం సాగుకు మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదలపై స్థానిక నీటి పారుదల శాఖా అతిథిగృహంలో శనివారం సంబంధితాధికారులు రైతులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలు చెబుతూ ఇప్పటికే వానాకాలం సీజన్ ప్రారంభమైందని, సాగు నీటిని త్వరగా విడుదలచేయాలని కోరారు. ఇప్పటికే ప్రాజెక్టు ఆయకట్టు 10శాతం వరకు మెట్ట పంటలు వేశారని, కొంతమంది తమ అభిప్రాయాన్ని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ ఈఈ ఎలమందయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో 16 అడుగులు(0.433 టీఎంసీలు) నీరు మాత్రమే నిల్వ ఉందని, వర్షాధారంపైనే ఆధారపడకుండా కేఎల్ఐ(కల్వకుర్తి ఎత్తిపోతల పథకం) ద్వారా డిండిని పూర్తి స్థాయిలో నింపేందుకు అక్కడి ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీ నుంచి సాగుకు నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ పరమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, రైతులు డి.వెంకటేశ్వరరావు, నాగార్జున్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, కుర్మారెడ్డి, లక్పతినాయక్, శ్రీనువాస్, బుచ్చిరెడ్డి, మైనొద్దిన్, విజయేందర్‌రెడ్డి, సాయికుమార్, చంద్రయ్య, కొండలు, బాలయ్య, వెంకటయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, టై, బెల్టులు పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు, టై, బెల్టులు పంపిణీ చేస్తున్న దాతలు

పెద్దవూర : మండలంలోని చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన దాతలు అందించిన స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు, టై,బెల్టులు, షూలను విద్యార్థులకు ఎంఈఓ తరి రాములు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ తరి రాములు అన్నారు. శనివారం మాజీ సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతిసంజీవరెడ్డి 35జతల షూ, డాక్టర్ గుర్రం సురేందర్‌రెడ్డి 35స్కూలు బ్యాగులు, గోర్ల జ్యోతియాదగిరి టై, బెల్టులు, ఐడీ కార్డులను ఉచితంగా అందజేశారు. వీరిని ఎంఈఓ తరి రాములు, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ధనుంజయ, ఉపాధ్యాయులు వేణాంగిణి రెడ్డి, సంధ్య, గ్రామస్తులు అరుణ్, శ్రీను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీర జవాన్లకు ఘన నివాళి


త్రిపురారం : లాన్స్‌నాయక్ మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు


మిర్యాలగూడ అర్బన్: ఎస్ఆర్ డీజీ స్కూల్‌లో నిర్వహించిన కార్గిల్ దివస్‌లో పాల్గొన్న డీఎస్పీ

మిర్యాలగూడ అర్బన్ : దేశం కోసం తమ ప్రాణాలను పనంగా పెట్టిన వీరసైనికులు త్యాగాలు విద్యార్థులకు తెలియజెప్పాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఆర్ డీజీ స్కూల్లో నిర్వహించి కార్గిల్ విజయ్ దివస్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన ధైర్య సాహాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకాడమిక్ చీఫ్ మనోజ్, డిజిఎం జి.లక్ష్మణ్‌రావు, జోనల్ ఇన్‌చార్జి స్నేహలత, ప్రిన్సిపల్ జానీ పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లను స్మరించుకున్నారు. అనంతరం కొణతాలపల్లిలో లాన్స్ నాయక్ మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, బైరం శ్రీను, కటకం మల్లి ఖార్జున్, చింతకాయల యాదయ్య, వేణు గోపాల్ రెడ్డి, విజయ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో..

కొండమల్లేపల్లి : దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రమావత్ రవి కార్గిల్ దివస్ పోరాట స్ఫూర్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ జి. కోటయ్య, సీహెచ్ లింగమయ్య, లింగారెడ్డి, ఎం. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని శనివారం మండలంలోని గర్నెకుంట సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మార్టిన్, ఉపాధ్యాయులు వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించాలి


తహసీల్దార్ కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి రక్షణగా ప్రహరీ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. భూభారతిలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేసి ఎటువంటి తగాదాలకు తావివ్వకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీటీ కోటేశ్వరి, ఆర్ఐ స్పందన, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాడుగులపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న దాయం భూపాల్‌రెడ్డి


డిండి : సమావేశంలో మాట్లాడుతున్న లాలూనాయక్

వేములపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బంటు సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిర్ర సాంబమూర్తి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న, పందిరి భాగ్యమ్మ, పగిడిపల్లి సోమయ్య, నిమ్మల జాన్‌రెడ్డి, పెదమాం భరత్, శోభన్‌బాబు, ప్రసాద్, ఉపేందర్, మహేష్, రాంరెడ్డి, లింగస్వామి, అనిల్, సతీష్, రమేష్, శివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు

అత్యధిక స్థానాల్లో బీజేపీనే గెలుస్తుంది

డిండి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోనీ ఈజే గార్డెన్‌లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలు ఆ పార్టీ కార్యాచరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలే తమ పార్టీని గెలిపిస్తాయన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండలాధ్యక్షుడు సైదా, అంజి యాదవ్, జైపాల్, అమృత్, రమేష్, సాయిగౌడ్ పాల్గొన్నారు. .

మాడుగులపల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల ప్రభారి దాయం భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు, మండల ఎన్నికల కన్వీనర్ గడ్డం వెంకట్ రెడ్డి, నాయకులు సర్నాల జానకిరాములు, వేముల లక్ష్మణ్, ఇందిర, దారమళ్ల నాగరాజు, భిక్షనాయక్, యాదగిరి, చంటి, సైదులు, వెంకన్న, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం

చందంపేట : ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరమని తిమ్మాపురం మాజీ సర్పంచ్ రవి అన్నారు. శనివారం తిమ్మాపురం పరిధిలోని పలుగుతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వినోద్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాజి సర్పంచ్ రవీందర్, బాలాజి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను విస్మరించిన కాంగ్రెస్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్

వేములపల్లి : రాష్ట్రంలోని మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపించదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందన్నారు. పేదింటి ఆడపడుచుల వివాహ సమయంలో ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం, మహిళలకు రూ.2500 భృతి, విద్యార్థినులకు స్కూటీలు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేల పింఛన్ వంటి హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, పెదపంగ సైదులు, కట్టా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు అతివేగంగా నడపొద్దు : ఎస్ఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి : మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ అజ్మీరా రమేశ్ అన్నారు. శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 20మంది ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రాము, నవీన్‌రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.